సంక్రాంతికి 'విశ్వంభర'

మెగాస్టార్ చిరంజీవి శుక్రవారం తన తాజా చిత్రం 'విశ్వంభర' సెట్‌లోకి అడుగుపెట్టారు. సోషియో ఫాంటసీ అడ్వెంచర్ కథాంశంతో దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా కోసం చిరంజీవి ఫిజికల్‌గా ఫిట్‌గా తయారయ్యారు. ఇటీవల ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన జిమ్ వీడియో వైరల్‌గా మారింది. దాదాపు 13 భారీ సెట్స్ ద్వారా విశ్వంభర ప్రపంచాన్ని సృష్టించింది చిత్ర బృందం. చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక వ్యయంతో రూపొందిస్తున్న చిత్రమిదని, విజువల్స్ మరోస్థాయిలో ఉంటాయని అంటున్నారు. చిరంజీవి షూటింగ్‌లో జాయిన్ అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. కాగా ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఛోటా కె నాయుడు, సంగీతం: యం.యం.కీరవాణి, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, రచన-దర్శకత్వం: వశిష్ట.

'యానిమల్' సీక్వెల్ అప్పుడేనా?

'యానిమల్' సీక్వెల్ 2025లోనే రానున్నదా?.. అంటే ఔననే సమాధానమే ఇస్తున్నది బాలీవుడ్ మూవీ బజార్. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన 'యానిమల్'పై ప్రేక్షకుల నుంచి విభిన్న స్పందన వచ్చింది. సినిమాలోని శృంగారం, క్రూరత్వంపై విమర్శకులు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో 'యానిమల్'కు సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' పేరుతో మరో చిత్రం రాబోతున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం ప్రకటించిన విషయం విదితమే. అయితే, ఈ సీక్వెల్ నిర్మాణానికి సంబంధించిన తాజా వార్త ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతున్నది. ఈ ఫిబ్రవరిలోనే సీక్వెల్.. రచన దశకు వెళ్తుందని సందీప్‌రెడ్డి వంగా సన్నిహిత వర్గాలు చెబుతున్నారు. తాజా సమాచారం ప్రకారం.. 'యానిమల్ పార్క్' నిర్మాత భూషణ్ కుమార్ ప్రస్తుతం హీరో ప్రభాస్‌తో 'స్పిరిట్' చిత్రీకరణ పనులను కొద్ది నెలల్లో ప్రారంభించే పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ కారణంగా డైరెక్టర్ సందీప్ ఇచ్చిన ప్లాట్‌లైన్ ఆధారంగా ప్రస్తుతానికి సమయం వృథా కాకుండా సీక్వెల్ స్క్రిప్ట్‌ను డెవలప్ చేసే పనిలో రైటింగ్ టీమ్ నిమగ్నం కానున్నది.

రాజ్‌తరుణ్, మాల్వి మల్హోత్రా

ప్రేమ ఒక ఉత్సవంలా..

రాజ్‌తరుణ్, మాల్వి మల్హోత్రా జంటగా నటిస్తున్న చిత్రం 'తిరగబడ రసామీ'. ఎ.ఎస్.రవికుమార్ చౌదరి దర్శకుడు. సురక్ష ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఫిబ్రవరిలో 23న విడుదల చేయబోతున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి సెలబ్రేషన్ సాంగ్‌ను విడుదల చేశారు. బేబీ స్వరపరచిన ఈ పాటను లిప్సికా భాష్యం, అదితి బావరాజు, చైతు సత్సంగి ఆలపించారు. సుద్దాల అశోక్‌తేజ ఈ గీతాన్ని రచించారు. ప్రేమ బంధాన్ని ఓ ఉత్సవంలా అభివర్ణిస్తూ ఈ పాట సాగింది. విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. రొమాన్స్, ఫ్యామిలీ సెంటిమెంట్, యాక్షన్ అంశాలతో ఆకట్టుకునే చిత్రమిదని చిత్ర బృందం తెలిపింది. మన్నారా చోప్రా, మకరంద్ దేశ్‌పాండే, రఘుబాబు, జాన్ విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జవహర్ రెడ్డి, సంగీతం: జేబీ, రచన-దర్శకత్వం: ఏఎస్ రవికుమార్ చౌదరి.

యుద్ధ వీరుడి కథ ఆధారంగా 'ఇక్కీస్'

ఇటీవల 'మెర్రీ క్రిస్మస్'ను తెరకెక్కించిన దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ తాజాగా మరో ప్రాజెక్టుకు సిద్ధమవుతున్నారు. అయితే తన తదుపరి చిత్రం 'ఇక్కీస్' (ఇరవై ఒకటి)లో తాజా మార్పును వెల్లడించారు. ఈ చిత్రంలో హీరోగా వరుణ్ ధావన్ నటించాల్సి ఉండగా, ఆ స్థానాన్ని ఇప్పుడు అగస్త్య నందతో భర్తీ అయ్యింది. 'ది ఆర్చీస్'తో నటనా రంగ ప్రవేశం చేసిన అగస్త్య నంద ఇప్పుడీ ఈ ఛాన్స్ కొట్టేశాడు. అయితే, అనూహ్యంగా హీరో మార్పు నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వివరించారు శ్రీరామ్ రాఘవన్. 'కరోనా కంటే ముందు అనుకున్న ప్రాజెక్టు 'ఇక్కీస్' (#21). ప్రారంభంలో టైటిల్ రోల్ కోసం వరుణ్ ధావన్‌ను అనుకున్నాం. 1971 యుద్ధం నేపథ్యానికి వ్యతిరేకంగా, సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్ పాల్ అనే యుద్ధ వీరుడి జీవితం ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఇది ఒక పెద్ద నిర్మాణం. యుద్ధ సన్నివేశాలు భారీ ఎత్తున ఉంటాయి. ఇది యువ జవాన్ ఖేతర్ పాల్ కథ. కాబట్టి కథ, కథనాల పరంగా చూస్తే ఈ సినిమాలో అతని బాల్యానికి ప్రాధాన్యం ఉండబోదు. అతిగా హీరోయిక్ ప్రదర్శన ఈ కథలో అవసరం ఉండదు. ఇందుకు అగస్త్య నంద సరిపోతాడని భావించాం' అని వివరించారు.

నిజజీవితానికి దగ్గరగా ఉంటుంది

లావణ్య త్రిపాఠి

గత ఏడాది నవంబర్‌లో మెగా హీరో వరుణ్ తేజ్‌తో వివాహబంధంలోకి అడుగుపెట్టింది లావణ్య త్రిపాఠి. ప్రస్తుతం ఈ దంపతులిద్దరూ ఎవరి కెరీర్‌లో వారు బిజీ అయిపోయారు. వరుణ్‌తేజ్ వంటి అర్థం చేసుకునే జీవిత భాగస్వామి దొరకడం అదృష్టమని, కెరీర్ విషయంలో కావాల్సినంత స్వేచ్ఛగా ఉన్నానని చెప్పింది లావణ్య త్రిపాఠి. ఆమె ప్రధాన పాత్రలో నటించిన వెబ్‌సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్' శుక్రవారం నుంచి డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ 'రొమాన్స్, కామెడీ కలబోసిన కథ ఇది. ఈ సిరీస్‌లో నేను మిస్ లావణ్య, లక్ష్మి అనే క్యారెక్టర్స్‌లో నటించాను. తను ఓ పర్‌ఫెక్షనిస్ట్. ప్రతి పనిలో పర్‌ఫెక్ట్‌గా ఉండాలనుకోవడం వల్ల కొన్ని ఇబ్బందులొస్తాయి. నా పాత్ర ఎమోషన్స్‌తో సాగుతుంది' అని చెప్పింది. తన వ్యక్తిగత జీవితానికి ఈ రెండు పాత్రలు చాలా దగ్గరగా ఉంటాయని, ఇంట్లో ఉన్నప్పుడు లక్ష్మిలా, సెట్‌లో మాత్రం లావణ్య క్యారెక్టర్‌లా పర్‌ఫెక్షన్ కోరుకుంటానని చెప్పింది. ఈ సిరీస్ వరుణ్‌తేజ్‌కు కూడా బాగా నచ్చిందని, దీని గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ కూడా చేశాడని లావణ్య త్రిపాఠి తెలిపింది. 'నేను గతంలో థ్రిల్లర్, యాక్షన్ సిరీస్‌లు చేశాను. దాంతో ఇప్పుడు రొమాంటిక్ కామెడీ చేయడం చాలా ఈజీగా అనిపించింది. సినిమాల విషయంలో నేను సెలెక్టివ్‌గా ఉంటా. తక్కువ సినిమాలు చేసినా నటిగా గుర్తుండిపోవాలనుకుంటా. ప్రస్తుతం ఓ కొత్త హీరోతో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలో సినిమా పూర్తి చేశాను. అందులో పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తా. మరో తమిళ సినిమా చేస్తున్నా' అని లావణ్య త్రిపాఠి చెప్పింది.

గూఢచారి పాత్రలో అలియా

బాలీవుడ్ భామలు అలియా భట్, శార్వరీ వాఘ్ త్వరలో ఓ సినిమాలో కలిసి నటించనున్నారు. ఓ సీనియర్ తార వర్ధమాన నటితో కలిసి తెర పంచుకోనుండడం ఈ సినిమా ఎలా ఉంటుందోననే విషయమై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొన్నది. మహిళా ప్రధాన నేపథ్యమున్న ఈ ప్రాజెక్ట్‌ను యష్‌రాజ్ ఫిలిమ్స్ (వైఆర్‌ఎఫ్) సంస్థ నిర్మిస్తున్నది. 'ది రైల్వే మెన్' వెబ్ సిరీస్‌తో డైరెక్టర్‌గా అరగేట్రం చేసిన శివ్ రావైల్ దర్శకత్వం వహించనున్నారు. ఈ ఏడాదే ప్రొడక్షన్ ప్రారంభం కానున్న ఈ చిత్రంలో ముద్దుగుమ్మలిద్దరూ సూపర్ ఏజెంట్లుగా కనిపించనున్నారు. చేపట్టిన ప్రాజెక్టులను తనదైన పనితీరుతో రూపొందించడం ద్వారా ఈతరం నాడి తెలిసిన డైరెక్టర్‌గా సినీజనాలు చెప్పుకొంటున్న శివ్ రావైల్ మహిళా నేతృత్వంలో వస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సైతం అద్భుతంగా మలుస్తాడని చర్చ నడుస్తున్నది. సీనియర్ నటి అలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, యువ నటి శార్వరీ వాఘ్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నదని సమాచారం. ఆదిత్య చోప్రాకు చెందిన అనేక చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన శివ్ రావైల్ ఇటీవల 'ది రైల్వే మెన్' వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించారు.

పూనమ్ పాండే మృతి

బాలీవుడ్ నటి, మోడల్ పూనమ్ పాండే (32) మృతిచెందారు. కొంతకాలంగా సర్వైకల్ (గర్భాశయ) క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె శుక్రవారం తెల్లవారుజామున ప్రాణాలు కోల్పోయినట్లు ఆమె మేనేజర్ మీడియాకు వెల్లడించారు. పూనమ్ మరణం గురించి శుక్రవారం ఉదయం ఆమె ఇన్‌స్టా ఖాతాలో వ్యక్తిగత సిబ్బంది పోస్ట్ చేయడంతో ఈ విషయం ఇండస్ట్రీని దిగ్భ్రాంతికి గురిచేసింది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన పూనమ్ 2013లో 'నషా'తో బాలీవుడ్‌లో నటిగా ప్రయాణం ప్రారంభించారు. తెలుగులో తీవ్రవాదం ఆధారంగా తెరకెక్కిన 'మాలినీ అండ్ కో'లో నటించారు. ప్రముఖ నటి కంగనా రనౌత్ హోస్ట్‌గా వ్యవహరించిన లాకప్ తొలి సీజన్‌లో పాల్గొన్నారు. 2011 వన్డే ప్రపంచ కప్ టోర్నీ సందర్భంగా 'ఇండియా ఫైనల్ మ్యాచ్ గెలిస్తే నేను దుస్తులు తొలిగిస్తా'.. అంటూ చేసిన ఓ ప్రకటనతో ఆమె చాలా పాపులర్ అయ్యారు. పూనమ్ వైవాహిక జీవితం కూడా వివాదాస్పదమైంది. భర్త తనను శారీరకంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడంటూ పోలీసు కేసు పెట్టారు. తర్వాతి రోజుల్లో ఆయన నుంచి విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటున్నారు.

వేసవిలో 'ఫ్యామిలీ స్టార్'



విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ కథానాయిక. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విజయ్ దేవరకొండ లుంగీ కట్టుకొని భుజాల మీద గన్నీ బ్యాగ్‌తో పరుగెత్తుతూ కనిపిస్తున్నారు. ఫ్యామిలీ, మాస్ యాక్షన్ అంశాలతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, సంగీతం: గోపీసుందర్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: వాసు వర్మ, రచన-దర్శకత్వం: పరశురామ్ పెట్ల.

తారలై మెరిసె.. నేతలై నిలిచె

తమిళ రాజకీయాల్లో తగ్గని సినీ గ్లామర్



సినీ పరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తారలకు తమిళ జనం అగ్రతాంబూలం అందిస్తారు. చిత్రసీమలో ఓ వెలుగు వెలిగి రాజకీయ అరగేట్రం చేసిన పలువురు నటీనటులు తమిళ రాజకీల్లోనూ సత్తా చాటారు. సినిమాల్లో తారలై మెరిసిన ఎందరో నటులు రాజకీయాల్లో నేతలుగానూ ఆదరణ పొందుతున్నారు. తమిళ రాజకీయాల్లో సినీ గ్లామర్ కొనసాగుతున్నది. అగ్ర నటుడు జోసెఫ్ విజయ్ 'తమిళగ వెట్రి కజగం' (తమిళనాడు విక్టరీ పార్టీ) పేరుతో రాజకీయ పార్టీ ప్రారంభించడం ద్వారా తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. తామంతా దళపతి అని పిలుచుకునే విజయ్ ఇప్పుడు రాజకీయారంగేట్రం చేస్తుండటంతో అభిమానుల్లో ఆనందం నింగినంటుతున్నది. రాజకీయాలు మరో వృత్తి కాదని పవిత్ర ప్రజా సేవ అని పేర్కొన్న విజయ్ తమిళనాడులో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే, దక్షిణాది నటులు రాజకీయ రంగ ప్రవేశం చేయడం కొత్తేమీ కాదు. వాస్తవానికి తమిళ రాజకీయాల్లోని ప్రస్తుత ప్రముఖులంతా సినీ తారలేనని చెప్పుకోవాలి.

ఎంజీఆర్: ఎంజీఆర్‌గా సుపరిచితుడైన మారుతుర్ గోపాలన్ రామచంద్రన్ సినీ నేపథ్యం నుంచి వచ్చి తమిళ రాజకీయాలను శాసించారు. 1977 జూన్ నుంచి 1987 డిసెంబర్‌లో మరణించే వరకు ఎంజీఆర్ మూడు పర్యాయాలు తమిళనాడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలందించారు. ఎంజీఆర్ 'ఆల్ ఇండియా అన్నా ద్రావిడ మున్నేట్ర కజగం (ఏఐఏడీఎంకే)ను స్థాపించారు. అయితే, 1972లో 'ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే)తో ఆయన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఎంజీఆర్ నాలుగు దశాబ్దాల పాటు నటుడిగా చలనచిత్ర రంగాన్ని ఏలారు. 1936లో సినీ రంగ ప్రవేశం చేసిన ఆయన పరిశ్రమ ప్రముఖుల్లో ఒకరిగా ఎదిగి 1987 వరకు నటుడిగా కొనసాగారు.

జయలలిత : తమిళ రాజకీయాలను శాసించిన మరో సినీ తార జయలలిత. ఈమె పూర్తి పేరు జయరామ్ జయలలిత. తమిళనాడు ముఖ్యమంత్రిగా ఆరు పర్యాయాలు పనిచేశారామె. 1960లో బాలనటిగా తన నటనా జీవితాన్ని ప్రారంభించి 1965లో ప్రధాన పాత్రలో తొలిసారి నటించారు. తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సుమారు 650 చిత్రాల్లో నటించారు. 1982లో తన అత్యంత విజయవంతమైన కోస్టార్ ఎంజీఆర్‌తో కలిసి రాజకీయాల్లోకి ప్రవేశించారు. అన్నాడీఎంకేలో చేరి, ఎంజీఆర్ మరణానంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యారు.

కెప్టెన్ విజయ్‌కాంత్: కెప్టెన్‌గా ప్రసిద్ధి చెందిన విజయ్‌కాంత్ కూడా తమిళ నటుడు, రాజకీయ నాయకుడే. ఈయన అసలు పేరు విజయ్‌రాజ్ అళగర్ స్వామి. దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం (డీఎండీకే) వ్యవస్థాపించారు. తమిళనాడులో ప్రతిపక్ష నేతగా పనిచేశారు. తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1979లో 'ఇనిక్కుం ఇలామై' సినిమాతో అరగేట్రం చేశారు. నాలుగు దశాబ్దాల సినీ జీవితంలో వందలాది సినిమాల్లో నటించారు.

నెపోలియన్: నెపోలియన్.. ఇది ఆయన రంగస్థల పేరు. ఆ పేరుతో సుపరిచితుడైన కుమరేశన్ దురైసామి.. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, ఇంగ్లిష్ భాషా సినిమాల్లో నటించారు. 1991లో సినీరంగ ప్రవేశం చేసిన నెపోలియన్ 2019లో తన మొదటి హాలీవుడ్ చిత్రం 'డెవిల్స్ నైట్: డాన్ ఆఫ్ ది నైస్ రూజ్'లో నటించారు. డీఎంకే ద్వారా రాజకీయాల్లో చేరిన ఆయన 2009 నుంచి 2013 మధ్య మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం-సాధికారత శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. తర్వాత డీఎంకేను వీడి 2015లో బీజేపీలో చేరారు.

కమల్‌హాసన్: కమల్‌హాసన్‌గా సుపరిచితుడైన పార్థసారథి శ్రీనివాస్ 2018లో 'మక్కల్ నీది మయ్యమ్' (ఎంఎన్ఎం) అనే పార్టీని స్థాపించి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తమిళనాడుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడి కుమారుడైన కమల్‌హాసన్ 1960లో ఆరేళ్ల వయసులో చైల్డ్ ఆర్టిస్ట్‌గా అరంగేట్రం చేశారు. అప్పటి నుంచి 'ఉలగనాయగన్' అని కూడా పిలువబడే కమల్ హాసన్ ఆరు దశాబ్దాల కెరీర్‌లో వివిధ భాషల్లో ఇప్పటివరకు 230కి పైగా చిత్రాల్లో నటించారు.